''ఎంత బావుంది ఈ సమీరం. ఇంకా ఇంకా ఆస్వాదించాలనిపించేట్లుగా...''

బాల్కనీలో నుంచుని ఆహ్లాదంగా వున్న పరిసరాలని ఆదమరచి చూస్తున్న సమీర చప్పున తలతిప్పి శశాంక్ వైపు చూసింది చురుగ్గా.

''ఐ మీన్ సమీరం అంటే పిల్లగాలి. ఈ పిల్లగాలి...'' సమీర కళ్లల్లోకి చూస్తూ 'ఈ' అన్న అక్షరాన్ని వత్తి పలుకుతూ అన్నాడు.

''సినిమా కవిలా డబుల్ మీనింగ్ డైలాగులు వదిలావంటే నేనిక్కడ క్షణం కూడా వుండను'' సమీర కోపంగా అంది.

''డబుల్ మీనింగ్‌లు వద్దా? వెరీగుడ్. డైరెక్ట్‌గా ప్రొసీడ్ అవుతానైతే'' ఆమె దగ్గరగా జరుగుతూ అన్నాడు.

సమీర కంగారుగా దూరంగా జరిగింది.

''ఈ పిల్లగాలి బావుంది. ఈ వెన్నెల బావుంది. ఈ ఏకాంతం బావుంది. అన్నింటికీ మించి నువ్వు మరీ బావున్నావు'' ఆమె చెయ్యి పట్టుకుంటూ అన్నాడు శశాంక్.

''ఏమిటిది?'' సమీర కోపంగా చెయ్యి విదుల్చుకుంది.

''ఏమిటో చెప్పాలనే చెయ్యి పట్టుకున్నది'' శశాంక్ కళ్లల్లో చిలిపిదనం.

''నేను వెళ్తున్నాను'' గబగబా లోపలికి వెళ్ళబోతున్న సమీరని వెనుక నుంచి వచ్చి పట్టుకున్నాడు.

''ప్లీజ్ శశీ! బిహేవ్ యువర్ సెల్ఫ్'' అతని పట్టునుండి విడిపించుకోవడానికి ప్రయత్నించింది.

''సమీరా! ప్లీజ్! డోంట్ సే నో. ఎలాగూ నెక్స్ట్ ఇయర్ మన పెళ్లి జరగబోతోంది. అనుకోకుండా ఈ రాత్రి ఏకాంతం దొరికింది. ఎంత మంచి ఛాన్స్. కమాన్. డోంట్ వేస్ట్ దిస్ నైట్.''


''ఏం మాట్లాడుతున్నావో నీకు తెలుస్తోందా? పెళ్లికి ముందు నాకిలాంటివి ఇష్టం వుండదని నీకు తెలీదా?''

''తెలుసు. కానీ ఈ రోజు ఐ జస్ట్ కాంట్ కంట్రోల్ మై సెల్ఫ్.''

''నో...నాకిష్టంలేదు.''

''నాకిష్టం'' సమీర చుట్టూ చేతులు బిగించాడు శశాంక్.

సమీర విసురుగా శశాంక చేతుల నుండి విడిపించుకుని చరచరా గదిలోకి వెళ్లి తలుపులు మూసుకుంది. మూసుకున్న తలుపులవైపే చూస్తూ నిలబడిపోయాడు శశాంక్.



పిచ్చిపిల్లా... నువ్వే మాటన్నావ్...అందరూ ఏడడుగులు నడిస్తేగానీ బంధం ఏర్పడదు. మరికొందరు కలిసి ఒక్క అడుగువేస్తే చాలు అని. అందుకు నేనేమన్నాను? గుర్తు తెచ్చుకో. మనం ఇప్పటికి చాలా అడుగులు కలిసి నడిచాము. ఇదే భావాన్ని నువ్వెంతో సృజనాత్మకంగా చెప్పావు. అలా చెప్పడంలో ఏదో కవితాత్మకంగానో, భావనాత్మకంగానో అన్న మాటలు కావు. ఓ వాస్తవం. అలా పెనవేసుకుపోయాం. ఆ విశ్వాసం నాలో ఏర్పడింది. బహుశా నీలో ఏర్పడలేదేమో! ఇలా డైలమాలో పడుతూ నన్ను అపార్థం చేసుకుని నా గురించి నెగటివ్‌గా కూడా ఆలోచిస్తున్నావు.

నీ గురించి గంటల తరబడి ఆత్రంగా, ఆత్మీయంగా, చిత్తశుద్ధితో స్పందించే నేను నిన్ను కోరుకోకూడదా? నిన్ను ముద్దు పెట్టుకోకూడదా? నాకా స్వేచ్ఛ, అధికారం, హక్కు లేవా చెప్పు?

చివరగా రాసావే...ఆ మాటలు నా గుండెల్లోకి బాణంలా దూసుకెళ్లాయి. ఈ మాత్రానికే నువ్విలా అపార్థం చేసుకుంటే ఇక చివరిదాకా మనం కలిసి జీవించగలమా? అసలు సూటిగా చెప్పు. నీకు నేనేంటో? నాకు నువ్వేంటో? ప్రతి అక్షరంలో, భావనలో నువ్వు చెప్పే ప్రతి కవితలో, పాడే ప్రతి పాటలో నీ హృదయాన్నీ, నా హృదయాన్నీ వ్యక్తపరుస్తుంటావ్. అలా సాగుతూ ఓ వినూత్న ఘట్టంలోకి

★★★

# దగ్గరయ్యేందుకు... వి.ఎస్

ఓ అలక సుందరీ!

ఇకనైనా అలకపాన్పు దిగు తల్లీ. అలక అందంగా వుండాలి. గిలిగింతలు పెట్టాలి. తలచుకుని మురిసిపోయేలా వుండాలి. మళ్లీ మళ్లీ అలిగితే అలిగిన వేళనే చూడాలి ఆ అంతర్యపు సోయగం అన్నట్లుగా వుండాలి. అలగడం, అలక తీర్చడం శృంగారంలో సొగసైన ఘట్టంలా వుండాలి. ప్రతి అలకా దూరాన్ని తగ్గిస్తూ గాలి కూడా చొరబడలేనంతగా ఐక్యం చేయగలగాలి.

అప్పుడప్పుడు అలుగుతానన్నావ్. చాలా ముచ్చటేసింది. నీ అలక తీర్చే మధుర అవకాశం ఎప్పుడొస్తుందా అని ఎదురుచూసాను. వచ్చింది. అలగటంలో నీ అందం ద్విగుణీకృతం అయ్యుంటుందేమోగానీ నువ్వు భయంకరంగా నన్ను అపార్థం చేసుకుని అక్కడ నువ్వు మౌనం వహించి ఇక్కడ నన్ను చాలా దారుణంగా ఏడిపించావు. నా హృదయాన్ని నలగ్గొట్టి వొదిలావ్. నీ లెటర్ ఇప్పటికీ చేరకుంటే నేనేమయ్యేవాడినో, ఏం చేసుండునో నాకే తెలీదు.

A అడల్ట్స్ ఓన్లీ!

హృదయాలు చేరుకుని అద్వైత స్థితిని పొంది హృదయాలు తపించే వేళ, శృంగార భావం వద్దని, అలాంటి భావనలు వద్దు అంటూ తిక్కగా మాట్లాడుతుంటావ్. దాంతో ఏంటిరా బాబూ మెంటల్ కేసులా వుంది అనిపిస్తుంటుంది.

ఏం రాయాలో, ఎలా రాయాలో, హృదయాన్ని ఎలా ఆవిష్కరించుకోవాలో తెలీక చాలా రోజులు కలం కదలలేదు. ఏం రాస్తే ఏం చిక్కో ఈ తిక్క పిల్లతోనని వెనుకంజ వేసాను.

మొత్తానికి నువ్వు బాగా అందంగా స్వీట్‌గా సాధిస్తుంటావ్ (అందాలరాశివి కదా. అలక కూడా అందంగానే వుంటుంది మరి) తల్లీ! ఇదిగో చెంపలేసుకుంటున్నా ఇకపై నీ దగ్గరున్నప్పుడు

ఒళ్ళు దగ్గర పెట్టుకుని బుద్ధిగా వుంటాను. చాలా? ఈజిట్ ఓకే? నీకు కోపం తెప్పించాను కాబట్టి నీకు జవాబు చెప్పాల్సిన బాధ్యత నాకుంది. చెప్పాను. ఇకనైనా నీ అలక తీరిందా?

నేను వచ్చే శుక్రవారం ఆఫీసు పనిమీద హైదరాబాద్ వస్తున్నాను. ఆ రోజు సాయంత్రం నా ఫ్లాట్‌లో కలుసుకో. సందేహించకు. నీ చిటికెన వేలు కూడా తాకను. ప్రామిస్. తప్పక వస్తావు కదూ? ఇంకా నాపై కోపమా?

సఖీ...నీవలిగితే నే తాళజాలా...

ఇంకేం చెప్పను?

నువ్వు నా ప్రపంచం. నువ్వు నా సర్వస్వం.

నీ

శశి.

ఉత్తరం మడుస్తూ హాయిగా నవ్వుకుంది సమీర. ఏదో వింత అనుభూతి మెలమెల్లగా మనసంతా పరచుకుంటున్నట్లుగా ఉంది. ఉత్తరంలోని ప్రతి అక్షరంలోంచి వెడ్డింగ్ బెల్స్ మ్యూజిక్ వినిపిస్తుంటే పరవశంగా కళ్ళు మూసుకుంది.

★★★

''హమ్మయ్య వచ్చావా?'' సమీరకి ఎదురొస్తూ అన్నాడు శశాంక్.

సమీర చిరునవ్వు నవ్వింది.

''ధన్యులం'' లోపలికి నడుస్తూ అన్నాడు.

''ఎందుకు?'' అతన్ని అనుసరిస్తూ అడిగింది.

''పిలవగానే వచ్చినందుకు. అంత చక్కని నవ్వు నవ్వినందుకు.''

సమీర తిరిగి నవ్వింది. చూపు మరల్చుకోలేకపోయాడు శశాంక్.

మేఘాల మధ్య నుండి బైటికొచ్చిన నిండు చందమామలాంటి మోము, కవిత్వాన్ని ఒలకబోసే విశాలమైన కళ్ళు, సన్నజాజుల్ని గుర్తుకుతెచ్చే నవ్వు. ప్రతి కదలికలోనూ ఏదో స్నిగ్ధత్వం. ఇరవై సంవత్సరాల ముగ్ధత్వం.

''ఏమిటా చూడ్డం?'' దబాయించింది సమీర.

''తాకొద్దు అన్నావు. చూడను కూడా చూడకూడదా?'' జాలిజాలిగా అడిగాడు.

ఆ చూపుల్లోని జాలికి తన మనసెక్కడ కరుగుతుందోనన్నట్లు తలదించుకుంది సమీర.

''కోపం పోయిందా?'' అడిగాడు మృదువుగా.

''ఊ!'' అంది తలెత్తకుండానే.

''అసలు నీకారోజు అంత కోపం ఎందుకొచ్చింది?'' శశాంక్ అర్థం కానట్లు అడిగాడు.

సమీర తలెత్తి సూటిగా చూసిందతనివైపు.

''రాదా మరి?''

''ఎందుకు రావాలి?'' రెట్టించాడు.

''చెబితే అర్థం చేసుకుంటావా?''

''చెప్పు.''

రెండు క్షణాలు మౌనం. ఆమె ఏదో చెప్పేందుకు ప్రయత్నిస్తోంది.

''ఏమిటో చెప్పు సమీరా'' లాలనగా అడిగాడు.

''చెప్పాక సిల్లీ అనవుగా.''

''అననులే చెప్పు'' నవ్వాడు.

''పెళ్లిమీద, భార్యాభర్తల బంధంమీద నాకొన్ని నియమాలు, నమ్మకాలు ఉన్నాయి శశీ. నా దృష్టిలో భార్యాభర్తల కలయిక అంటే ఒక బయోలాజికల్ నీడ్ కాదు. ఒక మనసు మరో మనసుతో దగ్గర దగ్గర అయినప్పుడు అతి సన్నిహితంగా మసలినప్పుడు కలిగే స్పందన. అది ఒక శాటిస్‌ఫాక్షన్ ఆఫ్ సోల్. ది లాంగ్వేజ్ ఆఫ్ సోల్. అది అవ్యక్తమైనదే కాదు. అనిర్వచనీయమైనది కూడా. ఒక అనుభవం కోసం పెళ్లికి ముందే తొందర పడితే ఎంత మంచి అనుభూతి మిస్సవుతామో తెలుసా? మొదటి రాత్రి అపురూపంగా దాచుకున్న అనుభూతులన్నీ దోసిలి తెరిచి మల్లెలు జార్చినట్టు ఒక్కొక్కటిగా అర్పించుకుంటుంటే అప్పుడు తెలుస్తుంది నైతికతలో వున్న ఆనందమేమిటో? ఏ క్షణికానందానికో ఈ పవిత్రతను బలిపెడితే పోగొట్టుకునేది ఒక జీవితకాలపు అనుభూతిని. ఎంతమంది అమ్మాయిలు, అబ్బాయిలు తొందరపడి ఈ దివ్యానుభూతిని దూరం చేసుకుంటున్నారో? ఎంతో స్వచ్ఛంగా, పూల దోసిట్లో కురిసిన మంచుబిందువులా, నాకు మిమ్మల్ని చేరుకోవాలని వుంది తప్ప ఇలా కాదు. మన పెళ్లికి ఇంకో సంవత్సరం టైముంది. అందాకా ఆగలేవా? నీకిదంతా సిల్లీగా అనిపించవచ్చు. రొమాన్స్ లేకుండా ఎలా అనుకోవచ్చు. రొమాంటిక్ టచ్ లేకపోతే పెళ్ళనేది వ్యర్థమే. కానీ విలువలు లేకపోతే జీవితమే వ్యర్థం. మన మొదటి రాత్రిని మొదటిదిగానే వుండనివ్వండి. ఆ రోజున మీకే తెలుస్తుంది ప్రపంచంలోని కొన్ని అనుభూతులు మాటలకి అందవని. అనుభవించి తెలుసుకోవలసిందేనని'' చెప్పడం ముగించి నవ్వింది.

''అద్భుతం. జీవితాన్ని ఎనలైజ్ చేయడం అందరివల్లా సాధ్యపడేదికాదు. ఎంత బాగా చెప్పింది. జీవితం మొత్తం వెంటాడే ఒక అనుభూతి గురించి'' ఆమె విశ్లేషణ అతన్ని ఆనందపరచింది.

ఆమె మృదువుగా చెబుతున్న మాటలు అతన్ని హిప్నటైజ్ చేస్తున్నట్లు మనసులో గాఢంగా నాటుకుపోయాయి.

''యస్! యూ ఆర్ కరెక్ట్. నువ్వు చెప్పింది నిజం'' మనస్ఫూర్తిగా ఒప్పుకున్నాడు.

''థాంక్స్'' ఆనందంగా నవ్వింది.

అరవిచ్చిన మందారంలాంటి ఆ నవ్వుని చూసి ముగ్ధుడైపోయాడు శశాంక్. సాయంకాలపు చివరి కిరణాలు ఆమె చెక్కిళ్లమీద ప్రతిఫలిస్తూ సంజకెంజాయ సౌందర్యాన్ని అతని కళ్ళముందు పరుస్తున్నాయి. ఆ కెంజాయవర్ణం ఆమె చెక్కిళ్ళదో, సంజ కిరణాలదో తెలియని అద్వైతం.

ఒక్కసారి ఆ చెక్కిళ్ళని తాకాలనే కోరిక కలిగింది శశాంక్‌కి. అప్రయత్నంగా ముందుకు సాగిన చేతిని ప్రయత్నపూర్వకంగా వెనక్కి తీసుకున్నాడు. అది గమనించి కూడా గమనించనట్టే ఉండిపోయింది సమీర.

''నా అవస్థ చూస్తుంటే నీకు సరదాగా ఉంది కదూ?'' నవ్వుతూ అడిగాడు.

''ఉండదా మరి?'' ఉడికిస్తూ అంది.

''వుంటుంది నీకేం? నేను మాత్రం చేతులు కట్టేసుకుని బుద్ధిగా ఉండాలన్న మాట! ఎన్నాళ్ళో నాకీ అవస్థ?'' ఉసూరుమని నిట్టూరుస్తూ అన్నాడు.

వచ్చే నవ్వుని ఆపుకునేందుకు ప్రయత్నించి విఫలమైంది సమీర.

''నీకు నవ్వులాటగానే వుంటుందిలే. నీ దగ్గర చేతులు కట్టుకుని ఉండడం నా వల్లకాదుగానీ పెళ్ళి ముహూర్తాలు పెట్టుకున్నాకే నేను మళ్లీ ఈ ఊరు వచ్చేది.''

''నిజంగా అప్పటిదాకా రావా?'' ఆశ్చర్యంగా చూసింది.

ఆశ్చర్యంతో విచ్చుకున్న ఆ కళ్లల్లోకి మైమరచి చూస్తూ రాగయుక్తంగా అన్నాడు.


''దూరముంటానులే...దగ్గరయ్యేందుకు.''

★

## ఎవరిలో ఏం చూసి ఇష్టపడతారు?

ఎవరు ఎంతగా చెప్పినా ప్రేమలో మొదట ప్రధానపాత్ర పోషించేది ఆకర్షణ మాత్రమే. ఈ విషయం మీద ఈమధ్య నిర్వహించిన సర్వే ఫలితాలు ఇలా వున్నాయి.

★ ఆడవారు ప్రధానంగా మగవారి హైట్‌ను, మగతనం ఉట్టిపడేలా నడిచే నడకను ఇష్టపడతారట. ఇక చక్కటి మీసం, కండలు తిరిగిన బాడీ, విశాలమైన ఛాతి కూడా ఆడవారికి నచ్చే అంశాలే.



★ మగవారి విషయానికి వస్తే ఆల్చిప్పల్లాంటి కళ్లు, లేక కలువరేకుల్లాంటి కళ్ళు, ఆ కళ్ళల్లో ఉట్టిపడే అమాయకత్వంలకు ఇట్టే ఆకర్షితులవుతారట. ముక్కు సంపెంగ, పెదవులు బింబోష్ఠములు, వక్షం కుధరము అయితే వారి నుంచి మగవారు దృష్టి మళ్ళించలేరు.

★ ఇదే తరహాలో మరి అబ్బాయిలు ఎలాంటి అమ్మాయి కావాలనుకుంటున్నారని నిర్వహించిన సర్వేలో ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఎక్కువ శాతం పురుషులు తమ తల్లిని గౌరవించే అమ్మాయి కావాలని కోరుకున్నారు. తల్లిలా తమ మనసు తెలుసుకుని ప్రవర్తించే అమ్మాయే మక్కువ అన్నారు. ఈ రెంటి ముందు ప్రేమను కురిపించే అమ్మాయి కూడా వెనక్కి వెళ్ళిపోయింది. స్త్రీత్వం ఉట్టిపడే అమ్మాయంటేనే ఇష్టమని దాదాపు ఎనభై శాతం మంది పేర్కొన్నారు. ఇవన్నీ చూస్తుంటే ఇష్టాలు, అభిరుచుల విషయంలో నాడు నేడు కూడా ఒకే రకంగా ఉన్నారని అనిపించడంలా!

–కుమార్